## క్లుప్తంగా

### శ్రీపాద శ్రీవల్లభ స్వామికి లక్ష బిల్వార్చన



శ్రీపాద శ్రీవల్లభ స్వామి పూజల్లో పాల్గొన్న మహారాష్ట్ర భక్తులు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

### మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులతో సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో గురువారం దాడులు చేసి అక్రమంగా మద్యం కలిగి ఉన్న కొమ్ము వీరవెంకట సత్యనారాయణను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

### ఆకట్టుకున్న గణిత వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి వేడుకల సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం గణిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గణిత ట్రెజర్ హంట్ పేరున వినూత్న పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.పుల్లయ్య, పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, గణిత ఉపాధ్యాయులు కె.అరుణ, డీవీఆర్ఎస్ వల్లీ, ఎ.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

### నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.4.98 లక్షలు



నూకాలమ్మ ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న మహిళలు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా ఏడు నెలల పది రోజులకు గాను రూ.4,98,995 ఆదాయంగా సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. గురువారం దేవాదాయ శాఖ తనిఖీ అధికారి చల్లా ఉదయ్ బాబు సమక్షంలో హుండీలను లెక్కించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, సభ్యులు లక్కాకుల కృష్ణ, బొజ్జా రెడ్డియ్య, బావిశెట్టి గంగరాజు, గంటా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి దిశగా అడుగులు

పెద్దాపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, నూకలమంతి నానాజీ, ఏఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని ఆత్మహత్య

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ హుకుంపేట గ్రామశివారులో గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తొండంగి ఎస్సై జి.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సుమారు 25 ఏళ్ల వయసు కలిగిన యువకుడు గ్రామ శివారు సరుగుడు తోటలోని తాటిచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు 5.4 అడుగుల ఎత్తు, సిమెంట్ కలర్ నెక్ బనియన్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో మార్చురీకి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04847 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఊరూరా పుట్టిన రోజు పండగ



పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నాయకులు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

- ఘనంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- గ్రామాల్లో జోరుగా సేవా కార్యక్రమాలు
- మొక్కలు నాటి, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొరబాబు

**సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు కేట్ చేసి సంబరాలు జరిపారు. ప్రజాప్రతినిధులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.**

పిఠాపురం: సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజల కోసం నిరంతర పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణంలో గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన సొంత నిధులతో 2 వేల మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నారు. కాగా శిక్షణ పొందుతున్న వారందరికీ ఎమ్మెల్యే మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక బీఎమ్మార్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతు జగన్ మోహన్‌రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు ముఖ్యమంత్రిగా మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు వులవకాయల నాగ లోవరాజు, గుబ్బల తులసీకుమార్, పిఠాపురం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, కొత్తపల్లి వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, అరిగెల రామయ్యదొర, కారే శ్రీనివాసరావు, ఆనాల సుదర్శన్, తలిశెట్టి వెంకటేశ్వరరావు, బొజ్జా దొరబాబు, బాలిపల్లి రాంబాబు, పచ్చిమళ్ల అప్పలరాజు, బోను దేవ, వజ్రపు వీరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పెద్దాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఆయన స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ రక్తం దానం చేయడమంటే మరో వ్యక్తి ప్రాణం నిలబెట్టినట్లేనన్నారు. జగనన్న నినాదంగా వందల సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌లు బొడ్డు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీరాజేశ్వరి, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఊబా జాన్ మోజెస్, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, దవులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కాండ్రకోట, తాటిపర్తి, చంద్రమాంపల్లి, వడ్లమూరు, ఆర్‌బీపట్నం తదితర గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాండ్రకోటలో గీతా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.



సామర్లకోటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

సామర్లకోట: నిరుద్యోగంతో అల్లాడిపోతున్న యువతీయువకులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని సచివాలయ కార్యదర్శుల సంఘ పట్టణ అధ్యక్షుడు జోగారావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక వైటీసీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ, వివిధ మండలాలకు చెందిన సచివాలయ కార్యదర్శులు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ కార్యదర్శులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని సచివాలయ కార్యదర్శులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మహబూబ్ భాషా, పట్టణ కార్యదర్శి సింగరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు



సీఎం జన్మదిన వేడుకల్లో రక్తదానం చేస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

## జన్మదిన వేడుక.. ఆనంద గీతిక

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, బండి దావీదు, కారే శ్రీనివాసరావు, ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్, గింజాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, జ్యోతుల బాబులు, సానా నాగు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## గొల్లప్రోలు నగర పంచాయతీ బడ్జెట్ ఆమోదం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1.68 కోట్ల మిగులుతో బడ్జెట్‌ను ఆమోదించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో గురువారం చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన నగర పంచాయతీ అత్యవసర సమావేశం నిర్వహించారు. 2023 అంచనా, 2022-23 సవరించిన బడ్జెట్‌ను అధికారులు సభలో ప్రవేశ పెట్టారు. అన్ని మార్గాల ద్వారా రూ.8.04 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. రూ.4.76 కోట్లు రాబడి రాగా రూ.3.29 కోట్లు వ్యయం అవుతుందని నిర్ణయించారు. ప్రారంభ నిల్వలు పరిగణలోకి తీసుకున్న అనంతరం ముగింపు నిల్వ రూ.1.68 కోట్లుగా అంచనా వేశారు. అభివృద్ధి పనులు, సిబ్బంది జీతభత్యాలు, కార్యాలయ నిర్వహణ, లైటింగ్, శానిటేషన్, తాగునీటి సరఫరా సహా వివిధ అవసరాల కింద పలు కేటాయింపులు చేశారు. స్థానిక జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో బడ్జెట్ వివరాలు చదివి వినిపిస్తున్న అధికారులు

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: సమాజంలో ప్రతీఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని దృఢమైన ప్రజాస్వామ్యానికి బాటలు వేయాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి గుర్రాల సెంటర్ వరకూ రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఓటు అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆర్డీఓ రామారావు మాట్లాడి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. 2024 జనవరిలోగా పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఏసుబాబు, డీటీ కాంతారావు, మున్సిపల్ ఆర్ఐ సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయం-1 వద్ద గత నాలుగున్నరేళ్లలో రేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కారే సాల్మన్, ఉమ్మిడి యోహను, కంబాల రాంబాబు, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పాడలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## విద్యార్థులకు చెకుముకి సైన్స్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈఓ శివరామకృష్ణయ్య



విజేతలకు బహుమతులు అందిస్తున్న వైస్ ఎంపీపీ దొరబాబు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలను ఎంపిక చేశారు. ఎంపికై న విద్యార్థులు జిల్లా స్థాయిలో జనవరి 7న జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్ఎం కేఎస్ అన్నపూర్ణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.రాజు, కార్యదర్శి ఎ.తేజ, ఉపాధ్యాయులు ఎస్.వీర్రాజు, డీఏ రాజు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**చెకుముకి పోటీల్లో మెరిసిన విద్యార్థులు**

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో స్థానిక ప్రతిభ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యలు మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, టి.శ్యామ్ సుందర్, ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్, ప్రిన్సిపాల్ టి.సునీతలు హాజరయ్యారు.

## క్రీస్తు జననం శుభ పరిణామం

పెద్దాపురం: యావత్ ప్రపంచానికి క్రీస్తు జననం ఓ శుభ పరిణామమని రెవరెండ్ డి.యోసేపు, క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందంలు అన్నారు. గురువారం చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ అంటే కేవలం వేషధారణ సంబరం కాదని, అసలైన క్రీస్తును ఆరాధించడమేనన్నారు. అనంతరం క్రైస్తవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో నంగిన శామ్యూల్ సుదీప్, వంకా జాన్, అభిషేక్, విజయ్ కుమార్, రాయవరపు వీరబాబు, నంగిన ప్రేమలత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే చర్యలు



కొండపల్లి సందప తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ రాజశేఖర్

పెద్దాపురం: మండలంలోని సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ హెచ్చరించారు. మండలంలోని ఆర్‌బీ కొత్తూరు, ఆర్‌బీపట్నం, కొండపల్లి, ఆనూరు సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్‌బీపట్నం, ఆనూరు గ్రామాల సంపద తయారీ కేంద్రాల వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కొండపల్లి సర్పంచ్ కొత్త చక్రరావు, కూనపురెడ్డి స్వామి తదితరులున్నారు.

## వచ్చే నెల 20న నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే నెల 20న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యాలయలో ఖాళీగా ఉన్న సీట్లకు గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 8,506 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకుని గంట ముందే పరీక్షా కేంద్రం వద్ద ఉండాలని సూచించారు.

# సాంకేతిక విద్యకు పెద్దపీట




- మండలంలో పంపిణీకి 1196 ట్యాబ్‌లు సిద్ధం
- విద్యార్థుల్లో ట్యాబ్‌లపై పెరిగిన ఆసక్తి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం విద్యా వ్యవస్థలో వినూత్న సంస్కరణలను తీసుకొస్తుంది. ప్రధానంగా మారుతున్న కాలానికి తగ్గట్టుగా సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తుంది. దాంట్లో భాగంగానే గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. వరుసగా రెండో ఏడాది ఉచితంగా ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు తీసుకోవడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. 8వ తరగతి నుంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోపడుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. గతేడాది ట్యాబ్‌లు పొందిన విద్యార్థులు ట్యాబ్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకున్నారని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. మండల పరిధిలో 1,196 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. మొదటి విడతలో 290 ట్యాబ్‌లు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి.

**ఆఫ్‌లైన్‌లోను వీడియో పాఠ్యాంశాలు**

8వ తరగతి విద్యార్థులు ఈ ట్యాబ్‌ల ద్వారా నిర్వహించే అభ్యసనాన్ని పర్యవేక్షించేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ట్యాబ్‌కు ఒకసారి చార్జింగ్ పెడితే 10 గంటల పాటు బ్యాటరీ బ్యాకప్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్‌లోనూ వీడియో పాఠ్యాంశాలను అభ్యసించేలా ప్రీలోడెడ్ కంటెంట్‌తో ఈ ట్యాబ్‌లను అందిస్తున్నారు. మూడేళ్ల పాటు వీటికి వారెంటీ ఉంటుందని భరోసా ఇస్తున్నారు. ఈ మేరకు ప్రతీ విద్యార్థి 10వ తరగతి వరకూ ఈ ట్యాబ్‌ల ద్వారా పాఠాలు అందుకునే అవకాశముంటుంది. ట్యాబ్‌ల్లో ఏదైనా సమస్య వచ్చినా వాటిని సరఫరా చేసిన సంస్థ తిరిగి సరిచేసి ఇస్తుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. విద్యార్థులను పక్కదారి పట్టించే ప్రమాదకర వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకుండా చర్యలు తీసుకున్నామంటున్నారు.


### నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం



గతేడాది ఇచ్చిన ట్యాబ్‌ను నేను సద్వినియోగం చేసుకుంటున్నాను. ట్యాబ్‌లో ఉన్న కంటెంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

– టి.నవ్యనిఖిత, 9వ తరగతి విద్యార్థిని, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

### లోపాలుంటే ఫిర్యాదులు చేయాలి



ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. ట్యాబ్‌లు వినియోగించే సమయంలో ఎటువంటి లోపాలు వచ్చినా ఫిర్యాదు చేయాలి. ఆయా ఫిర్యాదుల ఆధారంగా ఏడు రోజుల్లోగా విద్యాశాఖ కార్యాలయంలో ఉన్న సాంకేతిక సిబ్బంది వచ్చి సరిచేస్తారు. ఎక్కడైనా ట్యాబ్‌ల లోపాలపై హెచ్ఎంలు స్పందించపోతే మండల విద్యాశాఖ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.

– పి.పుల్లయ్య, మండల విద్యాశాఖాధికారి-2, సామర్లకోట